క్లుప్తంగా

నేడు హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళ వారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు చింతలపాలెంలో రూ. 4కోట్లతో నిర్మించిన కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయ భవనం ప్రారంభోత్సవం చేయనున్నారు. అనంతరం హుజూర్ నగర్ మండలం వేపల సింగారంలో రూ 2.31 కోట్లతో కందిబండ వరకు నిర్మించే ఆర్అండ్‌బీ రోడ్డు పనులకు శంకుస్థాపన, అనంతరం హుజూర్‌నగర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి మోడల్ కాలనీ వరకు రూ 6.5 కోట్లతో నిర్మించే డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. హుజూర్ నగర్ మండలం లక్కవరం నుంచి మగ్దూం నగర్ వరకు రూ 2.20 కోట్లతో నిర్మించే ఆర్ అండ్‌బీ రోడ్డు పనులకు లక్కవరంలో మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన చేస్తారని మంత్రి పీఆర్‌ఓ వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

మఠంపల్లి : మండల కేంద్రమైన మఠంపల్లిలో ఈనెల 2న దివంగత మాజీ ఉమ్మడిరాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్. వైఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని వైఎస్ఆర్ అభిమాన సంఘం అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభిమాన సంఘం జిల్లా నాయకులు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. మఠంపల్లిలోని సెయింటాన్స్ స్కూల్ సమీపంలో గల వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఉదయం 9గంటలకు వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల వైఎస్ఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు కర్నె వెంకన్న, గాదె లూర్థుమారెడ్డి, జార్జిరెడ్డి, ఆనందరెడ్డి, ఇన్నారెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, తిరుమల రెడ్డి పెద బాలశౌరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు రేపు వేలం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసులలో సీజ్ చేసిన ఒక ఆటో, 14 ద్విచక్ర వాహనాలకు ఈనెల 3న స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్ లక్ష్మా నాయక్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాల వేలంలో పాల్గొనే వారు అదే రోజు ఉదయం 9నుండి ఎక్సైజ్ స్టేషన్‌లో ముందస్తుగా దరావత్ రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

భారత ఆర్థిక వ్యవస్థలో ఎల్ఐసీది అగ్రస్థానం



ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగులు

కోదాడరూరల్ : భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఎల్ఐసీ అగ్రస్థానంలో నిలుస్తుందని సంస్థ కోదాడ బ్రాంచ్ మేనేజర్ భానుకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో సంస్థ 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. పాలసీ దారులకు 69ఏళ్ల నమ్మకమైన సేవలు అందిస్తు వారి మన్ననలు పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లియాఫీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వట్టికూటి మల్లేష్, విజయశంకర్, సువర్ణరాణి, కన్నయ్య, సూర్యానారాయణ, వెంకటాద్రి తదితరులు ఉన్నారు.

లింగరాజు మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

నడిగూడెం : మండల కేంద్రానికి కాంగ్రెస్ నాయకుడు గుండు లింగారాజు (38) అకాల మృతి ఆపార్టీకి తీరని లోటు అని కోదాడ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ అన్నారు. మండల కేంద్రానికి చెందిన వార్డు మాజీ సభ్యుడు గుండు లింగరాజు అనారోగ్యంతో బాధపడుతూ గత నెల 31న హైదరాబాద్‌లో ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సోమవారం ఆయన మృత దేహంపై పూలమాల వేసి, నివాళులర్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం ఉండొద్దు

హుజూర్‌నగర్ : ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో మండల పేయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా పట్టణంలో కిరాయిలకు ఉంటూ జీవించడానికి రెక్కల తప్ప మరే ఇతర ఆధారాలు లేని కార్మిక వర్గాన్ని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, ధనుంజయ నాయుడు, జెట్టి ప్రసాద్, తమ్మిశెట్టి రవి, తురక అంజయ్య, జక్కుల రమణ, డి రమేష్, పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు



నడిగూడెం : పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం వచ్చిన రైతులు



కోదాడ రూరల్ : ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నడిగూడెం : మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో యూరియా కోసం వందల మంది రైతులు సోమవారం బారులుదీరారు. వారం రోజులుగా నడిగూడెంకు యూరియా సరఫరా లేక పోవడంతో సోమవారం 444యూరియా బస్తాల లోడు రావడంతో ఉదయం ఏడు గంటల నుండే ఒక్కసారిగా వందల మంది రైతులు యూరియా కోసం బారులు తీరారు. దీంతో సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసుల సమక్ష్యంలో యూరియా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. రెండు ఎకరాల లోపు ఒక యూరియా బస్తా, రెండు ఎకరాకలు పైన ఉన్న రైతులకు రెండు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్, తహశీల్దారు బూసిరెడ్డి రామకృష్ణారెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి సమక్ష్యంలో యూరియా పంపిణీ జరిగింది. అనేక మందికి యూరియా అందకపోవడంతో ఆవేధనతో వెనుదిరిగారు. రాత్రి తొమ్మిది గంటల వరకు యూరియా పంపిణీ చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మునగాల సీఐ రామకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

కోదాడరూరల్ : ప్రభుత్వం రైతులు ఇబ్బంది పడకుండా సకాలంలో యూరియాను అందజేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం రైతులకు యూరియాను అందజేయాలని కోరుతూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి ఆర్డీఓ కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని రైతాంగానికి యూరియాను సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీనివాసరావు, వెంకటయ్య, మాతంగి ప్రసాద్, కొండయ్య, నాగేశ్వరరావు, గోపాల్, రాజు, పుల్లయ్య, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



నడిగూడెం : పోలీసు పహారాలో యూరియా పంపిణీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయమనోహరి

మునగాల : గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరు తమ ఇంటితో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోదాడ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయమనోహరి సూచించారు. మండలంలోని నారాయణగూడెంలో ఇటీవల పలువురు విషజ్వరాల బారిన పడి చికిత్స పొందుతుండడంతో రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె సోమవారం సందర్శించారు. తొలుత గ్రామంలో విషజ్వరాల బారిన పడిన వారి ఇళ్లకు వెళ్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జ్వరపీడితులు వినియోగించుకోవాలన్నారు. గ్రామంలో విషజ్వరాల తగ్గుముఖం పట్టే వరకు వైద్యశిబిరం కొనసాగిస్తామన్నారు. ఇందులో భాగంగా రేపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగాం అధికారి డాక్టర్ శ్రీశైలం, తాడువాయి, కలకోవ పల్లె దవాఖాన వైద్యాధికారులు డాక్టర్ వైష్ణవి, డాక్టర్ వినయ్‌కుమార్, రేపాల పీహెచ్‌సీ సూపర్‌వైజర్ జయమ్మ, హెల్త్ అసిస్టెంట్ కొర్రా లింగయ్య, ఏఎన్ఎం అమరగాని సుచరిత, పావని, పాల్గొన్నారు.



నారాయణగూడెంలో జ్వరపీడితుల ఇళ్లకు వెళ్లి పరామర్శిస్తున్న జయమనోహరి

జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నేతల రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు

నేరేడుచర్ల : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ వైఖరీని నిరసిస్తూ మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి పిలుపు మేరకు సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేరేడుచర్లలోని కోదాడ–జడ్చర్ల జాతీయ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారికి రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అరిబండి సురేష్‌బాబు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి చిత్తలూరు సైదులు, నాయకులు నాగండ్ల శ్రీధర్, యశోధరాములు, ఎల్లబోయిన లింగయ్య, అనంత్ శ్రీనివాస్ గౌడ్, గుర్రం మార్కెండేయ, పల్లె పంగ నాగరాజు, పిచ్చిరెడ్డి, రాపోలు నవీన్‌కుమార్, రామస్వామి, సుదర్శన్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలి



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ సత్యనారాయణరెడ్డి

నేరేడుచర్ల : కంప్యూటర్ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవానలి మండల విద్యాశాఖ అధికారి పుట్లూరు సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీటీ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ పాఠశాలలో కంప్యూటర్ విద్య విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ డిజిటల్ విద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రషీద్‌ఖాన్, శౌరీ, వెంకటేశ్వర్‌రావు, అన్నపూర్ణ, నర్సింహ్మారావు, మాధవి, నాగమణి, అర్జున్, వెంకటేశ్వర్లు, భానుమతి, జానయ్య, యాదగిరి, బాలు, వినోద్, లాల్జాన్, సరస్వతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్-14, అండర్-17 విద్యార్థులకు మండల స్థాయి క్రీడాకారులు ఎంపిక నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



హుజూర్‌నగర్ : గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయికులు



మేళ్లచెరువు : రోడ్డుపై ఏర్పడిన గుంతను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : గ్రామాల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్ల ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి బ్రహ్మం, మండల కార్యదర్శి పి హుస్సేన్ కోరారు. సోమవారం మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. అనంతరం ఆయా సమస్యలపై గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఆ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి మాదూరి నరసింహ చారి, మండల కమిటీ సభ్యులు వెంకట చంద్ర, లక్ష్మీనరసింహ, గోపరాజు, గోపి, పాల్గొన్నారు.

మేళ్లచెరువు : మండలకేంద్రంలోని మెయిన్‌రోడ్డులో గుంతలు ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మండలకేంద్రంలోని వెంకట్రామాపురం, మెయిన్ రోడ్డుపై ఏర్పడిన గుంతల వద్ద నిలబడి నిరసన తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి వాటిని పూడ్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు,ప్రయాణికులు పాల్గొన్నారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల నిరసన



కోదాడ : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



నేరేడుచర్ల : హైదరాబాద్‌కు తరలివెళ్తున్న పీఆర్‌టీయూ నాయకులు



నడిగూడెం బాలికల ఉన్నత పాఠశాలలో..

కోదాడ : తెలంగాణ ఉపాధ్యాయ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు పెన్షన్ విద్రోహదినంగా పాటించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం విరామ సమయంలో ప్లకార్డులతో, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ జిల్లా నాయకుడు బడుగుల సైదులు మాట్లాడుతూ భద్రతలేని సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ స్కీంను ప్రవేశపెట్టాలని కోరారు. పెన్షన్ ఉద్యోగుల హక్కు అని, దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో సలీంషరీఫ్, డి, మార్కెండేయ, జానకిరామ్, వేణు కుమార్, రవి, శ్రీనివాసరావు, అశోక్‌గౌడ్, ఇందిర, విజయ, సురేష్, జానీ, ధర్మ, ఆదిల్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన పీఆర్‌టీయూ నేతలు

నేరేడుచర్ల : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన మహాధర్నాకు సోమవారం నేరేడుచర్ల నుంచి పీఆర్‌టీయూ నేతలు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో పీఆర్‌టీయూ నాయకులు సత్యనారాయణరెడ్డి, సైదులు, చల్లా ప్రభాకర్‌రెడ్డి, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్, చందమళ్ల వెంకన్న, కీసర ప్రసాద్, శ్రీనివాస్, సత్యనారయణ, శ్రీనివాస్, నాగరాజు, సైదిరెడ్డి, శంకర్, బికోజి, వెంకటేశ్వర్లు, జానకిరాములు, నర్సిరెడ్డి తదితరులున్నారు.

చిలుకూరు: నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు, జై గౌడ ఉద్యోగ సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జై గౌడ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సురగాని లింగయ్య గౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

నడిగూడెం : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుత్తా కరుణ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బాలికల ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీనివాసరెడ్డి, చైతన్య, అరుణ జ్యోతి, హరిత, కల్పన, యశోద ల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంకు చెందిన మొలుగూరి నర్సింహారావు (38) ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో సోమవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పగడాల పద్మ రెండు క్వింటాళ్ల బియ్యం, రూ.2000, అదే గ్రామానికి చెందిన పల్లి సంజీవరెడ్డి రూ.3000 వేలు ఆర్థిక సాయం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుపులేటి వినయ్ వర్ధన్ బాబు, రామిని భూపాల్‌రెడ్డి, పగడాల బుచ్చిరెడ్డి, పగడాల రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రామారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండలంలోని కిందితండాకు చెందిన భూక్యా చిన్నా భార్య సురతీ సోమవారం ఆకస్మికంగా మృతి చెందింది. కుటుంబ పరిస్థితి దారుణంగా ఉండడంతో గమనించి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మాలోతు జ్యోతి శ్రీనునాయక్‌లు బాధితుడికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. అదే విధంగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు తులసీరామ్‌నాయక్, నాగేశ్వరరావు, బజ్జా, చింటూ, నాగు, మహేష్, శంకర్, నాగ్యా, హుస్సేన్, మిట్టానాయక్, రంజిత్, మేఘానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఎస్పీకి విరాళం చెక్కు అందజేస్తున్న ఎన్‌సీఎల్ అధికారులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి వద్ద క్రిష్ణానదిపై హైలెవల్ వంతెన మీదుగా వెళ్తున్న తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అంతరాష్ట్ర రహదారిపై గల మఠంపల్లి మండలంలోని గ్రామాల భద్రత సంరక్షణలో భాగంగా సీసీకెమెరాల ఏర్పాటుకు మండలంలోని నాగార్జున సిమెంట్ పరిశ్రమ అధికారులు సోమవారం రూ.5లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యాపేటలో ఎస్పీ కొత్తపల్లి నరసింహకు ఆ పరిశ్రమ యాజమాన్యం తరపున డీజీఎం హృదయ సతీష్‌కుమార్ చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలోహుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, పరిశ్రమ అధికారులు దస్తగిరిరెడ్డి, చెన్నూరు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు అలుగు తగ్గించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారాయణగూడెం గ్రామస్తులు

మునగాల : మండల కేంద్రంలో గల ఊరచెరువు ఎగువబాగాన ఉన్న నారాయణగూడెంలోకి చెరువు నీరు రావడంతో దోమల బెడద ఎక్కువై పలు కుటుంబాలు విషజ్వరాల బారిన పడుతున్నారని, తక్షణమే చెరువు అలుగును తగ్గించాలని గ్రామానికి చెందిన పలువురు సోమవారం తహసీల్దార్ వి.సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చెరువుకు ఆనుకొని గ్రామం ఉండడంతో చెరువులో నీరు అధికమై గ్రామంలోకి వస్తున్నాయని తెలిపారు. దీంతో కీటకాలు, దోమలు ఉధృతి ఎక్కువైందని ఆందోళన వ్యక్తంచేశారు. అంతేగాక సుమారు 150ఎకరాల మేర వరిపంట మునిగిపోయిందని , బాధిత రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. ఇదే విధంగా చెరువునీరు గ్రామంలోకి కొనసాగితే సగం గ్రామం విషజ్వరాల బారిన పడే ప్రమాదముందని వారు వివరించారు. నారాయణగూడెం గ్రామప్రజలకు న్యాయం జరుగకుంటే కోదాడ ఎమ్మెల్యే పద్మావతి క్యాంపు కార్యాలయం ముట్టడి చేస్తామని వారు హె చ్చరించాకు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బిసి యువజనసంఘం నాయకుడు గడ్డం లక్ష్మీనారాయణ, గ్రామస్థులు సోమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మంగయ్య, కంప్యూటర్ శ్రీను, జగన్నాధం, గడ్డం నాగరాజు, మిట్టగడుపుల శ్రీను, తొండల గుర్వయ్య, నవీల వెంకయ్య, కాంపాటి శ్రీను, ఉపేందర్, నాగరాజు, పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయాలి

భానుపురి (సూర్యాపేట) : రికార్డులను తారమారు చేసి మా భూమిని అక్రమంగా ఇతరుల పేరు మీద పట్టా చేయాలని చూస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని హుజూర్‌నగర్‌కు చెందిన పిల్లుట్ల లక్ష్మి, పిల్లుట్ల నాగేంద్రమ్మ వేడుకున్నారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతి పత్రం అందించారు. తమ సమస్యను కలెక్టర్‌కు వివరించారు. గత నెల 29న తహసీల్దార్ కార్యాలయంలో విచారణకు హాజరై అన్నీ డాక్యుమెంట్లు అందించామని, అయితే తమ వాదనలు పట్టించుకోకుండా తహసీల్దార్ ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

హుజూర్‌నగర్ : దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాతృమూర్తిపై అవమానకర వ్యాఖ్యలు చేసిన జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణలు చెప్పాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీశ్‌గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం పట్టణంలో రాహుల్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు దేనుమకొండ రామరాజు, ఇంటి రవి, మేళ్ళచెరువు లక్ష్మణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా గోపి, పట్టణ ఉపాధ్యక్షుడు పైడిమర్రి విజయ్, పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే బీసీ రిజర్వేషన్లు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ హక్కుల సాధన సమితి చేసిన పోరాటాల ఫలితమే నేడు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని ఆసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు కట్టుబడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు అశోక్, పసుపులేటి సోమయ్య, శ్రీనివాస్, రమణ, పాల్గొన్నారు.

మునగాల : గత 50ఏళ్లుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బడుగు,బలహీన వర్గాల పోరాట ఫలితమే నేడు బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అందుతున్నాయని, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఆమోదించడం అభినందీయమన్నారు. వ్యతిరేకంగా తెలంగాణలో కోర్టులకు వెళ్తే వారి ఇళ్లను ముట్టడించి రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు.

కొనసాగుతున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు



కోదాడ : పూజలో పాల్గొన్న మహిళలు



నేరేడుచర్ల : శ్రీకోదండ రామాలయంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు



చిలుకూరు : వినాయక నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మంచ్యాతండా లిఫ్టుకు మరమ్మతులు చేపట్టాలి

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండా లిఫ్టుకు మరమ్మతులు చేపట్టి పూర్తి స్థాయిలో ఆయకట్టుకు సాగునీరందేలా చూడాలని కోరుతూ సోమవారం స్థానిక లిఫ్టు చైర్మన్ కోట్యానాయక్ ఆధ్వర్యంలో ఐబీ ఈఈని సూర్యాపేటలో కలిసి శాలువాతో సన్మానించి విషయాన్ని విన్నవించారు. లిఫ్టు మరమ్మతులకు గురికావడంతో సాగునీరు అందడం లేదని మరమ్మతులు చేపించాలని కోరడంతో ఈఈ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ కిషన్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ చంద్రునాయక్, నాయకులు బాబునాయక్, నాగేశ్వరరావు,బాబు, చంద్రియా, గోపానాయక్, రాజానాయక్ తదితరులున్నారు.

ఆశా వర్కర్లు ముందస్తు అరెస్టు

చిలుకూరు : ఆశా వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వారు వెళ్లకుండా, వారికి మద్దతుగా ఉన్న సీపీఎం నాయకులను సోమవారం పోలీసులు వారిని ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు అనూష, సుహాసిని, గుండు సరిత, సుశీల, ఉపేంద్ర, రమ్య, నాగమణి, మున్ని, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.